సాక్షి
ఖమ్మం
శనివారం । 28 । అక్టోబర్ । 2023





ఆర్టీసీకి దసరా ధమాకా!

దసరా సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపించగా రీజియన్‌లో 14రోజులకు రూ.1.40కోట్ల ఆదాయం సమకూరింది. 12లో



బియ్యం ధరలకు రెక్కలు

సన్నరకాల సాగు తగ్గడం, రైతుల వద్ద నిల్వలు తరిగిపోవడంతో మార్కెట్‌లో సన్నబియ్యం ధరలు నానాటికీ పెరుగుతున్నాయి. 12లో

గరిష్టం / కనిష్టం
$33^{\circ} / 22^{\circ}$

వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి పెరుగుతుంది. రాత్రి చలి వాతావరణం ఉంటుంది.

రామదాసుతో మోక్షం..
సీతారామతో కరువు దూరం

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గెలిస్తేనే ఖమ్మం అభివృద్ధి

- ఎల్లయ్య, మల్లయ్య గెలిస్తే జిల్లాకు అయ్యేదేం లేదు
- ప్రజల్లో కలిసిపోయే ఉపేందర్‌రెడ్డిని గెలిపిస్తే పాలేరు అంతా దళితబంధు
- తుమ్మల ఇంట్లో మూలన కూర్చుంటే మిత్రుడని చేరదీశా
- డబ్బు మదంతో రాజకీయాలు.. పాలేరులో పోటీకి ప్రయత్నం
- పాలేరు ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్



సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన ఎమ్మెల్యే, పాలేరు బీఆర్‌ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి, వేదికపై మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, రవిచంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, బానోతు మదన్‌లాల్, మధుసూదనాచారి, దేశపతి తదితరులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'మేము చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలన్నీ జరగాలంటే కచ్చితంగా బీఆర్‌ఎస్ గెలవాలి. బీఆర్‌ఎస్ ఎలాగూ అధికారంలోకి వస్తది. ఖమ్మంలో రెండుసార్లు మాకు ఒక్కో సీటే వచ్చింది. అయినా బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడు కూడా బీఆర్‌ఎస్ వస్తది. ఖమ్మం ప్రజలకు నాది ఒకటే విజ్ఞప్తి. ఎవరో ఎల్లయ్య, మల్లయ్య గెలిస్తే అయ్యేదేం లేదు. అదే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గెలిస్తే.. బ్రహ్మాండంగా జిల్లా అభివృద్ధికి పాటుపడతారు. సీతారామ ప్రాజెక్టును పూర్తిచేస్తారు. పోడు భూముల పంపిణీ కింద జిల్లాలో లక్షలాది ఎకరాలను పంపిణీ చేసి రైతుబంధు, రైతుబీమా కూడా ఇచ్చాం. గతంలో ఉన్న పోడు కేసులన్నీ ఎత్తివేశాం. పాలేరులో ఇంజనీరింగ్ కాలేజీ తెచ్చుకున్నాం. ఖమ్మం పక్కనే పాలేరు ఉంటుంది కాబట్టి.. రాబోయే రోజుల్లో ఖమ్మం, పాలేరు చెట్టాపట్టాలు వేసుకుని బ్రహ్మాండంగా అభివృద్ధి జరుగుతాయి'. అని ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడించారు. పాలేరు నియోజకవర్గానికి సంబంధించి కూసుమంచి మండలం జీళ్లచెరువులో శుక్రవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు నాలుగు మండలాల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు. ఈసభలో పాల్గొన్న కేసీఆర్ తొలుత అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఆయన తన ప్రసంగంలో ఓవైపు కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తూనే.. మరోవైపు ప్రత్యక్షంగా మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పరోక్షంగా మాజీ ఎంపీ పొంగులేటిపై విమర్శలు సంధించారు. గతంలో రెండుసార్లు ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్‌కు ఒక్కో సీటే వచ్చినా అభివృద్ధి చేశామని, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందంటూ సాగిన కేసీఆర్ ప్రసంగం ఆయన మాటల్లోనే..



నువ్వు చేసింది గుండుసున్నా..

మిత్రుడు తుమ్మల నాగేశ్వరరావు నేను ఆయనకు అన్యాయం చేశానని ప్రచారం చేస్తున్నారు. ఆయన ఖమ్మంలో అజయ్‌పై ఓడిపోయిండు. ఓడిపోయి ఇంట్లో మూలకు కూర్చున్నాడు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నేను పాత స్నేహితుడని, సీనియర్ నాయకుడని తీసుకొచ్చి ఏ పదవి లేకున్నా మంత్రి పదవి ఇచ్చి ఎమ్మెల్సీని చేసి.. ఆ తర్వాత. పాలేరులో ఆనాడు వెంకటరెడ్డి చనిపోయాడు. వాస్తవానికి వెంకటరెడ్డి భార్యను మేము అభ్యర్థిగా పెట్టాలనుకున్నాం. కానీ ఈన వచ్చి అన్నా.. నా నియోజకవర్గం రిజర్వ్ అయింది. నాకు అవకాశం ఇస్తే పాలేరుకు సేవ చేస్తా.. పాలేరును కాపాడుకుంటా అన్నడు. బై ఎన్నికల్లో టికెట్ ఇచ్చి.. బ్రహ్మాండంగా పాలేరు నియోజకవర్గ ప్రజలు 42 వేల మెజార్టీతో గెలిపించారు. మీకు ఇంత పనిచేసి ఓడిపోయి ఉంటే మంత్రిని చేసి ఎమ్మెల్సీని చేసి.. పాలేరులో ఎమ్మెల్యేను చేసి.. జిల్లా మీద ఏకచత్రాధిపత్యం ఇస్తే నువ్వు చేసిందేంది? గుండుసున్నా. ఖమ్మం జిల్లాలో ఒక్క సీటు రాకుండా చేశావు. ఎవరు ద్రోహం చేశారు. ఎవరు ఎవరికి నష్టం చేశారు. బీఆర్‌ఎస్‌కు తుమ్మల అన్యాయం చేశారా.. లేదా బీఆర్‌ఎస్ తుమ్మలకు అన్యాయం చేసిందా..ఈ చరిత్ర అంతా మీ కళ్ల ముందు జరిగింది. ఇవన్నీ మర్చిపోలేం. ఇవ్వాళ వచ్చి అడ్డగోలుగా నోరుంది కదా అని కేసీఆర్ మీద, బీఆర్‌ఎస్ మీద, అజయ్ మీద, నామ మీద, ఇతరుల మీద అడ్డగోలుగా మాట్లాడితే ప్రజాస్వామ్యం కాదు.. అరాచకం. ఈ అరాచకాన్ని తిప్పి కొట్టాల్సింది ప్రజలే. అరాచక రాజకీయవేత్తలకు బుద్ధి చెప్పాల్సింది ప్రజలే.



జీళ్లచెరువులో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు కు హాజరైన జనం

సత్తుపల్లిలా పాలేరులో దళితబంధు..

మా దగ్గర దళితులు పెద్ద సంఖ్యలో ఉన్నారని ఉపేందర్‌రెడ్డి అన్నారు. అలాగే గిరిజనులు పెద్ద సంఖ్యలో ఉన్నారని చెప్పారు. మీరు ఉపేందర్‌రెడ్డిని గెలిపిస్తే పాలేరు నియోజకవర్గమంతా సత్తుపల్లి మాదిరి దళితబంధు పెట్టించే బాధ్యత నాది. నేనే స్వయంగా వచ్చి ఎట్లయితే హుజూరాబాద్‌లో చేశామో అట్ల చేస్త. కోట్లు, నోట్లు పట్టుకొచ్చే వారు ఏం చేయరు. దళితబంధు వస్తే ప్రతీ దళిత కుటుంబానికి రూ.10 లక్షలు వస్తాయి. దళిత సమాజం ఒకసారి ఆలోచన చేయాలి. నేను మీకు మాట ఇస్తా ఉన్నా.. ఉపేందర్‌రెడ్డిని అసెంబ్లీ వాకిలి దాటివ్వండి.. దళితబంధు ఇచ్చే బాధ్యత నాది. ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతుంటే విన్నా.. అది ఉపన్యాసం మాదిరి లేదు. తన సొంత మనుషులతో మాట్లాడినట్లు ఉంది. నా సెల్‌ఫోన్ నంబర్ మీ దగ్గర ఉందా అని ఉపేందర్‌రెడ్డి ప్రజలను అడిగారు. రాజకీయాల్లో ఇంత చనువుగా, చొరవగా ప్రజల్లో కలిసిపోయే నాయకులు తక్కువ. మీకు ఉపేందర్‌రెడ్డి ఉన్నారు. మీరు చాలా అదృష్టవంతులు.

కరువు కాటకాల నుంచి మోక్షం..

తెలంగాణ వచ్చిన ఫలితం ఏందో పాలేరు ప్రజలకు తెలుసు. పాలేరులో భక్తరామదాసు లిఫ్ట్ ఇరిగేషన్‌ను ప్రారంభించుకునేందుకు వస్తుంటే మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి నాతో వచ్చారు. ఎందుకు వస్తున్నారని అడిగితే.. నాది కూడా పాలేరు నియోజకవర్గమే సర్.. 45 ఏళ్లలో 40 ఏళ్లు పాలేరు కరువు కాటకాలకు గురైంది. ఈ రోజు మీరు ఈ ప్రాంతానికి నీళ్లు అందిస్తున్నారు. ఆ సంతోషంలో నేను కూడా భాగస్వామం కావాలనుకుంటున్నట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాకముందే ఈ రాష్ట్రంలో చాలా పార్టీలు రాజ్యం ఏలాయి. పాలేరు ప్రజలను వారి కర్మకు వదిలాయి. మంచినీళ్లు, సాగునీరు ఇవ్వాలని ఆలోచన చేయనే లేదు. ఇప్పుడు పాలేరుకు మోక్షం లభించిందంటే అది బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాకే. భక్తరామదాసు పూర్తయి బ్రహ్మాండంగా నీళ్లు ఇచ్చాం.

పాలేరు చైతన్యం ఉన్న ప్రాంతం.

కమ్యూనిస్టులు కూడా చాలాకాలం ఇక్కడ ఎమ్మెల్యేలుగా ఉన్న ప్రాంతం. ఉద్యమాలు జరిగిన ప్రాంతం. మీ అందరినీ కోరేది ఒక్కటే నీతి నిజాయితీ, చిత్తశుద్ధితో ప్రజల కోసం కులం, మతం లేకుండా సర్వజనుల సంక్షేమం కోసం ఎవరు పనిచేశారో వారిని గెలిపించాలి. డబ్బు కట్టల అహంకారంతో.. మాటలు, పార్టీలు మార్చే వారికి అవకాశం ఇస్తే వారు గెలుస్తారు కానీ ప్రజలు ఓడిపోతారు. రాబోయే రోజుల్లో సీతారామ ప్రాజెక్టు పూర్తవుతోంది. పాలేరుకు లింక్ కాబోతోంది. సాగర్ కెనాల్ కింద ఉన్న ఆయకట్టు సాగవుతుంది. ఖమ్మం జిల్లాలో శాశ్వత కరువు, పీడ తొలిగిపోతుంది. పాలేరులో ఇక కరువు తొంగి చూడదు.

ఆ నాలుకలు ఉల్టా మాట్లాడుతున్నాయి..

కేసీఆర్ వల్లే పాలేరుకు మోక్షం వచ్చిందని మాట్లాడిన నాలుకలు ఈరోజు ఉల్టా మాట్లాడుతున్నయి. నరం లేని నాలుక మారవచ్చు కాని సత్యం మారదు కదా.. నిజం నిప్పు లాంటిది కదా.. ఎవరి వల్ల మోక్షం వచ్చిందో మీకు తెలుసు. లంబాడీ తండాలను ఎవరు పంచాయతీలను చేశారో మీకు తెలుసు. మా తండాల్లో మా రాజ్యం, మా గూడెంలో మా రాజ్యం అంటే ఎవరూ కనికరించలేదు. పాలేరు నియోజకవర్గంలో 38 నుంచి 40 తండాలు గ్రామపంచాయతీలయ్యాయి. ఇవ్వాళ లంబాడీ బిడ్డలు వారి తండాల్లో వారే రాజ్యం చేస్తున్నారు.

కడుపులో పేగులు లాగుతారు..

జిల్లాలో ఇద్దరు బహురూపుల నాయకులు ఉన్నారు. డబ్బు అహంకారం. డబ్బుతో ఎవరినైనా కొనగలం, ఏదైనా చేయగలం, అని అహంకారపూరిత మాటలు మాట్లాడుతున్నారు. ఆ నాయకులు ఎవరో మీకు తెలుసు. పాలేరులో నిలబడాలని ప్రయత్నం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ వాకిలి కూడా తొక్కనివ్వమని మాట్లాడుతున్నారు. మీరందరు అనుకుంటే అసెంబ్లీ వాకిలి ఎవరు తొక్కుతరు. మీరు అందరూ అనుకుంటే దుమ్ము లేవదా.. నోట్ల కట్టలు, డబ్బులు కట్టల అహంకారంతోని నాలుగు పైరవీలు, నాలుగు కాంట్రాక్టులు చేసి సంపాదించుకుని ఆ డబ్బు మదంతో ప్రజలు, ప్రజాస్వామ్యాన్నే కొంటాం అని అహంకార పూరిత మాటలు మాట్లాడుతున్నారు. ఇది రాజకీయమా? ఇవ్వాళ కోట్లకు కోట్లు ఖర్చు పెట్టి ఓట్లు తీసుకుని ఏమార్చి.. అదే చేయి పెట్టి కడుపులో పేగులు లాగుతారు. ఆ మాట మర్చిపోతమా.. దెబ్బతింటం.

ఈ సభలో రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, వైరా ఎమ్మెల్యే రాములు నాయక్, వైరా అభ్యర్థి మదన్‌లాల్, దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, నేతలు ఉప్పల వెంకటరమణ, యాతాకుల భాస్కర్ మాదిగ, ఇంటూరి శేఖర్, బెల్లం వేణు తదితరులు పాల్గొన్నారు.

మీ బిడ్డగా మళ్లీ ఆశీర్వదించండి

ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి



కూసుమంచి: ఎమ్మెల్యేగా గెలిచిన నాటినుంచి నియోజకవర్గంలో ప్రతీ ఊరు తిరిగానని, ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకున్న తనను పాలేరు బిడ్డగా మరోమారు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి కోరారు. ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ పాలేరును ఎంతగానో అభివృద్ధి చేసినందున ఈ ప్రాంత ప్రజలు సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటారని తెలిపారు. పాలేరు బిడ్డలు మంచిగా చదువుకోవాలనేదే తన తపన అని, అందుకోసం శక్తిమేరకు సహకారం అందిస్తున్నానని చెప్పారు. రాజకీయాల కంటే తనకు ప్రజల అభివృద్ధి ముఖ్యమని తెలిపారు. పాలేరును రెవెన్యూ డివిజన్‌గా మార్చడంతో పాటు నియోజకవర్గంలో మరో రెండు కొత్త మండలాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్యే కోరారు.

సీఎం సభ హైలెట్స్..


- సభా ప్రాంగణానికి ఉదయం 11 గంటల నుండే కార్యకర్తలు ఆటోల్లో, ట్రాక్టర్లలో, ద్విచక్ర వాహనాలపై చేరుకున్నారు.
- సభావేదికను ప్రత్యేక భద్రతాధికారి షానవాజ్ ఖాసిం పలుమార్లు తనిఖీ చేశారు.
- సభా ప్రాంగణంలో షామియానాలు లేక ప్రజలు రహదారి వెంట చెట్లనీడలో సేద తీరడం కనిపించింది.
- గులాబీరంగు చీరలు ధరించి వచ్చిన మహిళలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.
- వేదిక ఎదుట సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి సైకత ప్రతిమలు ఆకట్టుకున్నాయి.
- సభకు పురుషుల కంటే మహిళలే ఎక్కువగా రాగా, అందరికీ వాటర్‌బాటిళ్లు సరఫరా చేశారు.
- సీఎం కేసీఆర్ మధ్యాహ్నం 3.08 గంటలకు హెలీకాప్టర్ నుంచి దిగి పది నిమిషాల్లో వేదిపైకి చేరుకున్నారు.
- ఇరవై నిమిషాలకు పైగా సీఎం కేసీఆర్ ప్రసంగించారు.
- మీ ఎమ్మెల్యే షామియానాలు వేయలేదు.. అందుకే మిమ్మల్ని ఇబ్బంది పెట్టనులే అంటూ సీఎం తన ప్రసంగంలో చలోక్తి విసిరారు.
- వేదికపై మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామా, వద్దిరాజు, ఎమ్మెల్సీ మధు కూర్చున్నా ప్రసంగించలేదు.
- రోడ్లపై ఉన్న వారిని సభాప్రాంగణంలోకి రావాలంటూ మంత్రి అజయ్, ఎంపీ నామా, ఎమ్మెల్సీ మధు పదేపదే కోరారు.
- ఏపూరి సోమన్న ఆధ్వర్యంలో కళాకారుల తెలంగాణ గీతాలు ఉర్రూతలూగించాయి.
- సభ అనంతరం సీఎంకు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి భక్త రామదాసు ప్రతిమను బహూకరించారు.
- కూసుమంచి ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ గిరిజన భాషలో మాట్లాడి ఉత్తేజపరిచారు.

ఖమ్మం, పాలేరు.. తుమ్మల, పొంగులేటి

- కాంగ్రెస్ రెండో జాబితాలో వెల్లడి
- పినపాక నుంచి పాయం వెంకటేశ్వర్లు
- మరో ఐదు స్థానాలపై అదే ఉత్కంఠ



తుమ్మల నాగేశ్వరరావు



పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఏఐసీసీ ప్రకటించిన రెండో విడత జాబితాలో ఉమ్మడి ఖమ్మం నుంచి మూడు స్థానాలకు చోటు దక్కింది. అంతా ఊహించినట్టుగానే ఖమ్మం నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పాలేరు నుంచి మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభ్యర్థిత్వాలు ఖరారు కాగా.. పినపాకలో పాయం వెంకటేశ్వర్లు బరిలో నిలవనున్నారు. తొలి జాబితాలో మధిర నుంచి సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, భద్రాచలం నియోజకవర్గానికి పొదెం వీరయ్య పేర్లు వెల్లడించిన విషయం విదితమే. అయితే, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది నియోజకవర్గాలకు గాను ఇప్పటి వరకు ఐదు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించగా.. వైరా, సత్తుపల్లి, అశ్వారావుపేట, కొత్తగూడెం, ఇల్లెందు స్థానాలపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఇందులో కొత్తగూడెం మినహా మిగిలినవి రిజర్వుడ్‌వే. ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో మలివిడత జాబితాలో ప్రకటించే అవకాశం ఉంది. సీఎల్పీ నేత భట్టి, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరులు ఇక్కడ టికెట్ కోసం పోటీ పడుతుండడంతో అధిష్టానం ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు సమాచారం. గెలుపు అవకాశాలున్న అభ్యర్థులను ఎంపిక చేయడంతోపాటు.. టికెట్ రాని వారిని బుజ్జగించే ప్రక్రియ చేపట్టారు. మరోపక్క సీపీఎం, సీపీఐతో పొత్తు నేపథ్యంలో ఐదు స్థానాల్లో ఏమేం కేటాయిస్తారనే చర్చ జరుగుతోంది.

మూడోసారి ఖమ్మం బరిలో..

మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 1983లో టీడీపీ తరఫున రాజకీయ అరంగేట్రం చేశారు. 1985, 1994, 1999లో సత్తుపల్లి నుంచి, 2009లో ఖమ్మంలో పోటీ చేసి గెలుపొందారు. 2014లో ఖమ్మంలో ఓటమి పాలయ్యారు. ఆయన ఎన్టీఆర్, చంద్రబాబు క్యాబినెట్లలోనే కాక తెలంగాణలో కేసీఆర్ క్యాబినెట్‌లో మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున పాలేరు టికెట్ ఆశించి భంగపడిన ఆయన గత నెల 16న కాంగ్రెస్ పార్టీలో చేరారు. పాలేరు టికెట్ కోసం చివరి వరకు ప్రయత్నించినా.. ఖమ్మం నుంచే పోటీకి దింపేందుకు అధిష్టానం మొగ్గుచూపింది. 2009లో సత్తుపల్లి ఎస్సీ రిజర్వ్‌డ్ కావడంతో ఆయన ఖమ్మం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత 2014లోనూ టీడీపీ నుంచే పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ చేతిలో ఓటమి పాలయ్యారు. అనంతరం 2016లో పాలేరు ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2018లో కూడా అక్కడి నుంచే బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగినా ఓటమి ఎదురైంది. ఇప్పుడు మూడోసారి ఖమ్మం నుంచి.. రెండోసారి పువ్వాడ అజయ్‌కుమార్‌పై ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీకి దిగుతున్నారు. సామాజిక సమీకరణాల నేపథ్యంలో అధికార పార్టీకి దీటుగా ఖమ్మం నుంచే ఆయనను కాంగ్రెస్ పార్టీ బరిలో నిలుపుతోంది.

పాలేరు నుంచి పొంగులేటి

మాజీ మంత్రి, కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి పాలేరు బరిలో దిగుతున్నారు. ఈ ఏడాది జనవరి 1న ఆయన బీఆర్‌ఎస్‌పై నిరసన గళం వినిపించారు. ఆ తర్వాత పార్టీ నుంచి సస్పెండ్ కాగా.. జూలై 2న ఖమ్మంలో జరిగిన భారీ బహిరంగ సభలో తన అనుచరులతో కలిసి రాహుల్‌గాంధీ సమక్షాన కాంగ్రెస్ గూటికి చేరారు. 2014లో పొంగులేటి వైఎస్సార్ సీపీ ఖమ్మం ఎంపీ గెలుపొందారు. 2016లో పాలేరు ఉప ఎన్నిక సందర్భంగా పొంగులేటి బీఆర్‌ఎస్‌లో తన అనుచరులతో కలిసి చేరారు. 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి ఆయన పార్లమెంట్ అభ్యర్థిత్వం ఆశించినా దక్కలేదు. ఆ తర్వాత పరిణామాలతో రాజకీయ మార్పు తథ్యమైంది. కాంగ్రెస్‌లో చేరాక పాలేరు, ఖమ్మం, కొత్తగూడెం జనరల్ స్థానాల్లో ఎక్కడ నుంచి బరిలో దిగుతారనే ఉత్కంఠ కొనసాగింది. ఇక్కడ కూడా అధికార పార్టీ అభ్యర్థి సామాజిక వర్గ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పొంగులేటిని శ్రీనివాసరెడ్డిని అధిష్టానం పోటీకి దింపింది.

క్లుప్తంగా

సీఎం సభ ఏర్పాట్లు పరిశీలించిన పువ్వాడ



మైదానాన్ని పరిశీలిస్తున్న మంత్రి, ఎంపీలు

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 5న ఖమ్మంలో జరిగే ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొనను న్నారు. ఇందుకోసం ఖమ్మంలోని ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు చేసుస్తున్నారు. ఈమేరకు ప్రాంగణాన్ని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్.. ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్రతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ప్రాంగణంలో సభా వేదిక నిర్మాణం, గ్యాలరీల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు.

కేసీఆర్ సభా ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య

కల్లూరు రూరల్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వచ్చేనెల 1న కల్లూరులో జరిగే ప్రజా ఆశీర్వాద బహిరంగ సభలో సీఎం కేసీఆర్ పాల్గొననున్నారు. ఈమేరకు ఏర్పాట్లను శుక్రవారం ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పరిశీలించారు. సభావేదికతో పాటు బారికేడ్ల ఏర్పాట్లలో వేగం పెంచాలని, వాహనాల పార్కింగ్‌కు స్థలాలు సిద్ధం చేయాలని స్థానిక నాయకులకు సూచించారు. అలాగే, సభకు భారీగా జనం హాజరయ్యేలా ఇంటింటికీ ప్రచారం చేయాలని తెలిపారు.

నేడు పాక్షిక చంద్రగ్రహణం

ఎర్రుపాలెం/ఖమ్మం గాంధీచౌక్: ఆశ్వయుజ శుక్ల పూర్ణిమ అయిన శనివారం అర్ధరాత్రి పాక్షిక చంద్రగ్రహణం ఏర్పడనుందని అర్చకులు తెలిపారు. శనివారం అర్ధరాత్రి 1.03 గంటలకు గ్రహణం ప్రారంభమై ఆదివారం తెల్లవారుజాము 2.22 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. మొత్తంగా 1:15గంటల పాటు గ్రహణ సమయం ఉందని ఖమ్మంకు చెందిన వేదపండితులు ఆమంచి సురేశ్‌శర్మ తెలిపారు. కాగా, గ్రహణం సందర్భంగా ఎర్రుపాలెం మండలంలోని జమలాపురంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మూసివేయనున్నట్లు ఈఓ కె.జగన్మోహన్‌రావు తెలిపారు. శనివారం 3గంటలకు ఆలయ ద్వారబంధనం చేయనుండగా, ఆదివారం ఉదయం ఆలయ శుద్ధి, దేవతామూర్తులకు అభిషేకం, సంప్రోక్షణ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆతర్వాత ఉదయం 9గంటలకు భక్తులను స్వామి దర్శనానికి అనుమతిస్తామని ఆయన తెలిపారు.

రేపు వైఎస్సార్ టీపీ ముఖ్య నేతల సమావేశం

ఖమ్మంరూరల్: వైఎస్సార్ టీపీ ముఖ్య నాయకుల సమావేశాన్ని ఆదివారం ఏర్పాటుచేసినట్లు ఆ పార్టీ నాయకుడు నంద్యాల రవీందర్ రెడ్డి తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం సత్యనారాయణపురంలోని టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10:30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని వెల్లడించారు. పార్టీ గౌరవ అధ్యక్షురాలు వైఎస్.విజయమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొనే ఈసమావేశానికి నియోజకవర్గంలోని పార్టీ ముఖ్య నాయకులు, బూత్ కమిటీ సభ్యులు హాజరుకావాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

విస్తృతంగా తనిఖీలు

ఖమ్మం సహకారనగర్: ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమల్లోకి వచ్చిన నాటి నుంచి నిఘా బృందాలు పటిష్టంగా విధులు నిర్వర్తిస్తున్నాయని అధికారులు వెల్లడించారు. పాలేరు నియోజకవర్గంలో శుక్రవారం సీఎం కేసీఆర్ సభ నిర్వహించిన నేపథ్యాన, ప్రముఖుల వాహనాలను సైతం తనిఖీ చేశామని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం సభ్యుడు, జిల్లా పశు సంవర్థక శాఖాధికారి వేణు మనోహర్ తెలిపారు. సీఎం ప్రయాణించిన హెలీకాప్టర్, బస్సు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల వాహనాలను తనిఖీ చేయగా, వారు సైతం సహకరించారని ఆయన ఓ ప్రకటనలో వ ఎల్లడించారు.

కాంగ్రెస్ కార్యకర్తపై బీఆర్‌ఎస్ శ్రేణుల దాడి

కామేపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి మండలంలోని సాతానిగూడెం పంచాయతీ పరిధి ఒడ్డుగూడెంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మొద్దని చెబుతుండగా.. గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త నల్లపాటి మాధవరావు 'నువ్వు ఏ పార్టీలో నుంచి వచ్చావు' అని ప్రశ్నించాడు. దీంతో బీఆర్‌ఎస్ కార్యకర్తలు దాడి చేయగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు హన్మంతరావు కార్యకర్తలను అడ్డుకుని మాధవరావుని పంపించడంతో గొడవ సద్దుమణిగింది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,231

పత్తి ధరపై కలెక్టర్ ఆరా!

- రైతులకు మద్దతు ధర దక్కేలా చూడాలని ఆదేశం
- మార్కెటింగ్ శాఖ అధికారులతో గౌతమ్ సమీక్ష

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంవ్యవసాయం: వ్యాపారుల తీరుతో పత్తి రైతులు నష్టపోతున్నారన్న సమాచారంతో కలెక్టర్ వీ.పీ.గౌతమ్ స్పందించారు. 'పతనం దిశగా పత్తి ధర' శీర్షికన ఈనెల 17న 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించి రైతులు నష్టపోకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం పత్తికి గరిష్టంగా రూ.7,020 మద్దతు ధర ప్రకటించగా వ్యాపారులు రూ.6 వేల నుంచి రూ.6,500కు మించి చెల్లించడం లేదు. దీంతో రైతుల ఆవేదను 'సాక్షి' వెలుగులోకి తీసుకురాగా, కలెక్టర్ గౌతమ్ పత్తి ధరలపై జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, ఖమ్మం మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శితో ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర దక్కేలా చూడాలని, సీసీఐ కేంద్రాలు త్వరగా ఏర్పాటయ్యేలా పర్యవేక్షించాలని ఆదేశించారు.



ఖమ్మం మార్కెట్‌కు తీసుకొచ్చిన పత్తి బస్తాలు

మార్కెటింగ్ శాఖ అధికారుల భేటీ

పత్తి ధర తగ్గుముఖం పట్టడం, కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో మార్కెటింగ్ శాఖ అధికారులు శుక్రవారం సీసీఐ తరఫున కొనుగోలు చేపట్టే వ్యాపారులను పిలిపించి సమీక్షించారు. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎంఏ అలీం, ఖమ్మం మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం వేర్వేరుగా మాట్లాడారు. సీసీఐ రూపొందించిన సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి రాగానే కొనుగోళ్లు మొదలుపెట్టాలని సూచించగా, వ్యాపారులు అంగీకరించారు. ప్రస్తుతం ఎండలు పెరిగిన నేపథ్యాన పత్తిలో తేమశాతం అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు.

డొంకదారి ధ్వంసంతో రైతుల ఇక్కట్లు

కారేపల్లి: కొంతకాలంగా నెలకొన్న భూవివాదం కారణంగా పొలాలకు వెళ్లే డొంకదారిని ధ్వంసం చేసి ముళ్ల కంచె వేసిన ఘటన మండలంలోని ఆలియాతండా గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన పచ్చిపాల మల్లయ్య, పచ్చిపాల అశోక్‌కు ఆలియాతండా సమీపాన వ్యవసాయ భూములు ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన నాగేశ్వరరావు, ప్రభాకర్ రావు, చిరంజీవి, వెంకట్, భద్రయ్య, రామయ్యకు కూడా భూములు ఉండగా, మల్లయ్య, అశోక్‌తో పాటు మరికొందరు రైతులను భయభ్రాంతులకు గురిచేస్తూ వారి చేన్ల నుంచి దారి ఇవ్వాలని బెదిరించినట్లు తెలిసింది. అంతటితో ఆగకుండా పాత్తులో ఉన్న డొంకదారిని ధ్వంసం చేసి ముళ్ల కంచెలు వేయడంతో పొలాలకు వెళ్లేందుకు మార్గం లేకుండా పోయింది. ఈ విషయమై కారేపల్లి పోలీసులకు పిర్యాదు చేయగా కేసు నమోదైనా వారు తీరు మార్చుకోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



చేన్లకు వెళ్లే దారిలో వేసిన కంచె వద్ద రైతులు

స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించిన అదనపు కలెక్టర్



ఎన్నికల ఏర్పాట్లపై చర్చిస్తున్న అదనపు కలెక్టర్

వైరా: వైరా అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంలను భద్రపరిచేందుకు స్థానిక గురుకుల పాఠశాలలో స్ట్రాంగ్ రూం ఏర్పాటుచేశారు. ఇప్పటికే ఇక్కడకు ఈవీఎంలు చేరుకున్న నేపథ్యాన జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ శుక్రవారం పరిశీలించారు. నిరంతరం పటిష్టమైన నిఘా ఏర్పాటుచేయాలని అధికారులకు సూచించారు. ఆతర్వాత చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీ తదితర అంశాలపై తహసీల్దార్ కేవీ.శ్రీనివాస్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ వెంకట్, అధికారులు పాల్గొన్నారు.

అమ్మవారి శోభాయాత్రలో ఘర్షణ

నలుగురు సీపీఎం కార్యకర్తలకు గాయాలు

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో కనకదుర్గ అమ్మవారి శోభాయాత్ర సందర్భంగా జరిగిన ఘర్షణలో నలుగురికి గాయాలయ్యాయి. అమ్మ వారి శోభాయాత్ర గురువారం అర్ధరాత్రి ఒంటి గంట వరకు కొనసాగగా ఘర్షణ మొదలైంది. ఈ ఘటనలో సీపీఎంకు చెందిన కారంగుల చంద్రయ్య, ఎర్రబోయిన నాగేశ్వరావు, కారంగుల కోటేశ్వరావు, షేక్ మదార్‌కు గాయాలయ్యాయి. తమపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేశాయని వారు ఆరోపించారు. కాగా, క్షతగాత్రులను ఖమ్మం ఆస్పత్రికి తరలించగా, సీఐ వసంతకుమార్, ఎస్‌ఐ సాయికుమార్ పరిశీలించి కేసు నమోదు చేశారు. కొంతకాలంగా గ్రామంలో సీపీఎం, కాంగ్రెస్ వర్గాల మధ్య ఘర్షణ జరుగుతుండగా కొద్దిరోజుల క్రితం జరిగిన దాడుల్లో 50 మందిపై కేసు నమోదైంది. అయినా మళ్లీ గొడవ జరగడం గమనార్హం. ఈ విషయం తెలుసుకున్న సీపీఎం నాయకుడు పోతినేని సుదర్శన్ శుక్రవారం గ్రామానికి వచ్చి క్షతగాత్రులను పరామర్శించారు. సర్పంచ్ ఉమ్మినేని బాబు, ఆయన కుమారుడు రమేష్ అకారణంగా తమ వారిపై దాడి చేయడమే కాక ఇళ్లపై రాళ్లు రువ్వారని ఆరోపించారు. పోలీసులు వైఫల్యం కారణంగానే తరచూ దాడులు జరుగుతున్నాయని తెలిపారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు పొన్నం వెంకటేశ్వరావు, చింతలచెర్వు కోటేశ్వరావు, మాదినేని రమేష్, దొండపాటి నాగేశ్వరావు, ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు వెళ్తుండగా ప్రమాదం

- ట్రాక్టర్ బోల్తా పడడంతో మహిళ మృతి
- ఘటనలో మరో ఐదుగురికి తీవ్ర గాయాలు

కూసుమంచి: మండలంలోని జీళ్లచెరువులో శుక్రవారం జరిగిన బీఆర్‌ఎస్ సభకు వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. గైగోళ్లపల్లి నుండి కార్యకర్తలు వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి పొలాల్లో బోల్తా పడగా ఓ మహిళ మృతి చెందడమే కాక మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గైగోళ్లపల్లి నుండి సుమారు 25 మంది కార్యకర్తలు ట్రాక్టర్‌లో జీళ్లచెరువు బయలుదేరారు. ఈక్రమంలో నాను తండా దాటి కూసుమంచి వైపు వస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్ ట్రక్కులో కూర్చున్న వారు బురదలో కూరుకుపోయారు. ఇందులో అల్లి అనసూర్య, సంగబత్తుల నర్సింహారెడ్డి, కొక్కిరేణి కృష్ణ, తురక ఎల్లమ్మ, తురక ఉప్పమ్మకు తీవ్రంగా గాయపడగా మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తుండగానే అల్లి అనసూర్య(50) మృతిచెందింది. మిగిలిన వారిని హుటాహుటిన ఖమ్మం ఆస్పత్రికి తరలించి, పరిస్థితి విషమంగా ఉన్న ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లారు.



అనసూర్య మృతదేహం



ఘటనాస్థలిలో క్షతగాత్రులు

ఎమ్మెల్యే పరామర్శ

ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన అనసూర్య మృతదేహం వద్ద కూసుమంచి పీహెచ్‌సీలో ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి నివాళులర్పించారు. ఆమె కుటుంబసభ్యులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే, ఖమ్మం ప్రభుత్వాస్పత్రి, కిమ్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కూడా ఎమ్మెల్యే పరామర్శించి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని తెలిపారు.

ఘటనకు బీఆర్‌ఎస్‌దే భాద్యత

కూసుమంచి/ఖమ్మం వన్‌టౌన్: సీఎం సభకు వెళ్తుండగా ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనకు బీఆర్‌ఎస్ పార్టీనే నైతిక బాధ్యత వహించాలని కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాదరెడ్డి డిమాండ్ చేశారు. ప్రమాదంలో మృతి చెందిన అల్లి అనసూర్య మృతదేహం వద్ద పొంగులేటి శ్రీనివాసరెడ్డి తనయుడు శ్రీహర్షతో కలిసి ఆయన నివాళులర్పించారు. మృతురాలి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు క్షతగాత్రులకు కూడా రూ.10లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. నాయకులు కళ్లెం వెంకటరెడ్డి, జొన్నలగడ్డ రవికుమార్, మాదాసు ఉపేందర్, హఫీజ్, వాసు, నవీన్, వీరభద్రం, రాంరెడ్డి, మనోహర్, జనార్దన్, మచ్చు పాల్గొన్నారు. కాగా, ప్రమాద ఘటనపై కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మెన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో శనివారం తన జన్మదిన వేడుకలను జరపకుండా, బాధితులకు అండగా నిలవాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు.

కొలిక్కి వచ్చిన హత్య కేసు విచారణ

పోలీసుల అదుపులో నిందితుడు

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలం శివాయిగూడెం వద్ద పాలీషింగ్ కార్మికుడు బక్కా హన్మంతరావు(40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా, పోలీసులు శుక్రవారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. చింతకాని మండలం రామకృష్ణాపురానికి చెందిన హన్మంతరావు గురువారం శివాయిగూడెం వద్ద ఓ టేకుతోటలో గాయాలతో మృతి చెంది ఉండగా గుర్తించారు. ఖమ్మం కాల్వొడ్డున నివసిస్తున్న ఆయన స్వగ్రామానికి వెళ్లగా, వేపకుంట్లకు చెందిన వ్యక్తి కారులో బయటకు తీసుకెళ్లాడు. ఆతర్వాత మృతదేహంగా తేలడంతో విచారణ చేపట్టిన పోలీసులు ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు వచ్చి మద్యం తాగినట్లు గుర్తించారు. దీంతో హన్మంతరావు వెంట ఉన్న వ్యక్తి ఎవరనే కోణంలో విచారణ చేపట్టి, ఖమ్మం జయనగర్ కాలనీలో ఉండే ప్రశాంతన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మరిపెడ బంగ్లాకు చెందిన ఆయన హన్మంతరావుతో కలిసి కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సదరు వ్యక్తికి తన బంధువుల అమ్మాయితో వివాహం జరిపిస్తానని హన్మంతరావు రెండేళ్లుగా చెబుతున్నాడని, ఈక్రమంలో బుధవారం సాయంత్రం కలిసి మద్యం తాగగా గొడవ జరిగి ఉంటుందని సమాచారం. దీంతో ప్రశాంతన్ దాడి చేయగా హన్మంతరావు మృతి చెందినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది.

రాష్ట్రంలో పేదలు బ్రతికే పరిస్థితి లేదు

- మీ హయాంలోనే రాక్షసపాలన
- మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో రాక్షసపాలన నడుస్తోందని, సీఎం కేసీఆర్ హయాంలో ఎమ్మెల్యేలను దోపిడీ యంత్రాల్లా మార్చి ప్రజలు బ్రతకలేని స్థితికి చేర్చారని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. ఖమ్మం 41వ డివిజన్‌లో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఓడిపోయి ఇంటి వద్ద ఉంటే మంత్రి పదవి ఇచ్చినానన్నా అని, వెంకటరెడ్డి భార్యకు ఇవ్వాల్సిన సీటు బ్రతిమిలాడితే తనకు ఇచ్చినట్లు కేసీఆర్ పాలేరు సభలో చెప్పడం గర్హనీయమన్నారు. ఆ రోజు పాలేరులో పోటీకి ఎవరూ లేకపోతే తాను వచ్చానని, స్వయంగా కేసీఆర్ పార్టీలోకి ఆహ్వానించిన విషయాన్ని మరిచిపోయారని తెలిపారు. పార్టీలో తాను చేరాక పెద్దసంఖ్యలో ప్రజాప్రతినిధులు వచ్చారని చెప్పారు. అప్పుడు పాలేరులో తన ఓటమికి ఎవరు కారణమో తెలిసినా సీఎం కేసీఆర్ ఇలా చెప్పడం సరికాదన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి మాట ఇచ్చి తప్పిన కేసీఆర్, ఇప్పుడు తనపై విమర్శలు చేస్తున్నారని తుమ్మల విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్, కార్పొరేటర్ కమర్తపు మురళితో పాటు వాహెబ్, చోటేబాబా, చెరుకూరి వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వరరావు

పకడ్బందీగా డ్రై డే కార్యక్రమాలు

ఖమ్మం డీఎంహెచ్‌ఓ మాలతి

ఖమ్మం వైద్యవిభాగం: సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రై డే కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేయాలని ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మాలతి సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం డెంగీ జ్వరాలు, సీజనల్ వ్యాధులపై అనుబంధ శాఖల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో డ్రైడే కార్యక్రమాలు తప్పక నిర్వహించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో నీటి నిల్వలను గుర్తించి, నిర్మూలిస్తూ దోమల వృద్ధిని అరికట్టాలని తెలిపారు. అలాగే, జ్వర బాధితులు, వారి కుటుంబ సభ్యుల నుండి రక్త నమూనాలు సేకరించాలని సూచించారు. డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు, అనుమానిత గ్రామాల్లో వైద్య శిబిరాలు విస్తృతంగా చేపట్టాలని తెలిపారు. తరచుగా తాగునీటి నమూనాలు సేకరించి బయోలాజికల్ పరీక్షలు నిర్వహించాలని, నీటి క్లోరినేషన్‌పై చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, ప్రతీ పదిహేను రోజుల కోసారి వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయించాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను కోరారు. ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డెంగీ జ్వరాలకు సంబంధించి ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నామని వెల్లడించారు. డీపీఓ హరికిషన్, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు మాట్లాడగా డీఎంఓ లక్ష్మీనారాయణ, సీనియర్ ఎంటమాలజిస్ట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

కోటమైసమ్మ ఆలయ హుండీ లెక్కింపు

కామేపల్లి: మండలంలోని కొత్తలింగాల శ్రీ కోటమైసమ్మ తల్లి దేవాలయం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు. ఈ సందర్భంగా యాభై రోజులకు గాను రూ.50వేల ఆదాయం సమకూరిందని దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారి ఆర్.సమత వెల్లడించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు కాంతమ్మ, ఈఓ నల్లమోతు శేషయ్య, చైర్మన్ మల్లెంపాటి శ్రీనివాసరావు, అర్చకులు పుల్లయ్యశర్మతోపాటు నర్సింహాచారి, బడాటి వరప్రసాద్ పాల్గొన్నారు.

రూ.10 లక్షల నగదు స్వాధీనం

ఖమ్మంక్రైం: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యాన టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు విస్తృతం చేశారు. ఇందులో భాగంగా ఖమ్మం గాంధీచౌక్‌లో శుక్రవారం తనిఖీలు చేపట్టిన పోలీసులు ఓ కారులో తీసుకెళ్తున్న రూ.10 లక్షల నగదును గుర్తించారు. అయితే, కారులో ఉన్న వ్యక్తి నగదుకు సంబంధించి ఆధారాలు సమర్పించకపోవడంతో సీజ్ చేశారు.

రూ.2.50 లక్షల విలువైన బాణాసంచా

ఖమ్మం నర్తకీ థియేటర్ సమీపాన అనుమతి లేకుండా గోదాంలో బాణాసంచా నిల్వ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించారు. ఈసందర్భంగా తనిఖీలు నిర్వహించి రూ.2.50 లక్షల విలువైన బాణాసంచా సీజ్ చేసినట్లు తెలిపారు.,

న్యూడ్ ఫొటోలతో బెదిరింపులు

- అడిగినంత డబ్బు ఇవ్వాలని డిమాండ్

నేలకొండపల్లి: తక్కువ వడ్డీ అంటూ చెప్పే మాయమాటలు నమ్మిన పలువురు అమాయకులు ఆ తర్వాత వేధింపులకు బలవుతున్నారు. మండల కేంద్రానికి చెందిన ఓ చిరు వ్యాపారి తన వ్యాపార అవసరాల కోసం యాప్ ద్వారా పది రోజుల క్రితం రూ.15 వేల రుణం తీసుకున్నాడు. అందులో ఇప్పటికే రూ.14 వేలు చెల్లించినా ఇంకా రూ.15 వేలు చెల్లించాలని గత మూడు రోజుల నుంచి ఫోన్ చేసి బెదిరిస్తున్నారు. ఆయన ససేమిరా అనడంతో అసభ్యకరమైన రీతిలో ఫొటోలు తయారుచేసి తొలుత బాధితుడికి పంపించారు. దీంతో ఆయన బతిమిలాడగా ఒక రోజు ఆగిన నిర్వాహకులు శుక్రవారం చెప్పినట్లుగానే పలువురికి ఫొటోలు పంపించారు. అంతేకాక ఫోన్ చేసి అసభ్య పదజాలంతో దూషిస్తుండడంతో సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బాలుడి ఆత్మహత్యాయత్నం

రఘునాథపాలెం: మండలంలోని సూర్యాతండాకు చెందిన బాలుడు శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పదో తరగతి చదువుతున్న సదరు బాలుడు అదే గ్రామానికి చెందిన విద్యార్థిని ప్రేమిస్తున్నానని చెప్పినట్లు సమాచారం. దీంతో పెద్దలు మందలించగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అయితే, ఘటన సమాచారం తెలిసినా ఫిర్యాదు అందలేదని రఘునాథపాలెం ఎస్‌ఐ కొండలరావు తెలిపారు.

బెల్టుషాపుల నిర్వాహకులపై కేసు

కారేపల్లి: బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న ముగ్గురిపై కారేపల్లి ఎక్సైజ్ అధికారులు శుక్రవారం కేసు నమోదు చేశారు. మండలంలోని ఉసిరికాయపల్లిలో శ్రీకోటమైసమ్మ జాతర జరుగుతుండగా అదేగ్రామానికి చెందిన హతీరాం, మున్న, రత్న బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసి మద్యం విక్రయిన్నారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సిబ్బంది తనిఖీలు చేపట్టి 107 మద్యం సీసాలను స్వాధీనం చేసుకోవడమే కాక ముగ్గురిపై నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపారు.

పది కేజీల గంజాయి స్వాధీనం

ఖమ్మంరూరల్: మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో శుక్రవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో పది కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డుకు చెందిన ఎస్.కల్యాణ్ గంజాయిని ఇతర ప్రాంతానికి తరలించడానికి సిద్ధం చేశాడు. ఈ విషయమై సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకుని కల్యాణ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి



సంతోష్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి (ఫైల్)

అశ్వాపురం: మండలంలోని మల్లెలమడుగు గ్రామంలో హైస్కూల్ సమీపంలో మొండికుంట - భద్రాచలం రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మొండికుంట గ్రామానికి చెందిన యువకులు ఎడ్ల సంతోష్‌రెడ్డి (32), మీ సేవ కేంద్రం నిర్వాహకుడు కందిమళ్ల శ్రీధర్‌రెడ్డి (37) మృతి చెందారు. సంతోష్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి బైక్‌పై మొండికుంట నుంచి భద్రాచలం వెళ్తుండగా హైస్కూల్ సమీపంలో మొండికుంట వైపు వెళ్తున్న ట్రాక్టర్ లైట్లు లేకుండా అతి వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో ఎడ్ల సంతోష్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీధర్‌రెడ్డిని 108 ద్వారా భద్రాచలం తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సంతోష్‌రెడ్డి పాల్వంచ కేటీపీఎస్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈయనకు గతంలో వివాహం జరగగా దంపతులు విడిపోయారు. మరో పది రోజుల్లో మరో యువతితో వివాహం జరగనుంది. వివాహానికి సంబంధించిన పనులపై శ్రీధర్‌రెడ్డితో కలిసి బైక్‌పై భద్రాచలం వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొని ఇద్దరు మృతి చెందారు. శ్రీధర్‌రెడ్డి మొండికుంట గ్రామంలో ఎన్నో ఏళ్లుగా మీ సేవ కేంద్రం నిర్వహిస్తూ ఓ దినపత్రిక రిపోర్టర్‌గా పనిచేస్తున్నాడు. వారిద్దరి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ సురేశ్‌కుమార్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

క్లుప్తంగా

పత్తి మద్దతు ధర రూ.18,500గా నిర్ణయించాలి


ఖమ్మం మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లను పరిశీలిస్తున్న నాయకులు

ఖమ్మంవ్యవసాయం: పత్తి క్వింటాకు మద్దతు ధర రూ.18,500గా నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఖమ్మం మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లను శుక్రవారం పరిశీలించిన అనంతరం సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా పత్తి దిగుబడి గణనీయంగా పడిపోవడంతో రైతులు నష్టపోయారని తెలిపారు. గత ఏడాది రూ.13 వేల వరకు పలికిన పత్తి ధర క్రమంగా తగ్గినప్పటికీ సీసీఐ రూ.7,020 ధర నిర్ణయించిందని చెప్పారు. అయితే, ఈ ధర ఏ మాత్రం సరిపోదని, రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రతినిధులు పాశం అప్పారావు, కేలోత్ లక్ష్మణ్, చిలకల నర్సింహారావు, మోహన్‌రావు పాల్గొన్నారు.

రేపు అండర్-14 క్రీడా జట్ల ఎంపిక

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన జిల్లాస్థాయి పాఠశాలల క్రీడా జట్ల ఎంపికకు ఈ నెల 29వ తేదీన పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి కె.నర్సింహమూర్తి తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్థాయిలో అండర్-14 విభాగం నుంచి షూటింగ్, లాన్ టెన్నిస్, జూడో, జిమ్నాస్టిక్స్ జట్లను, అండర్-17 విభాగంలో నెట్‌బాల్ బాలబాలికల జట్లు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే ఎంపిక పోటీలకు క్రీడాకారులు తమ వయస్సు ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని సూచించారు.

జాతీయస్థాయి ఉషూ పోటీలకు ఎంపిక


ఖమ్మంస్పోర్ట్స్: గోవాలో జరగనున్న 37వ జాతీయస్థాయి ఉషూ పోటీలకు జిల్లా నుంచి పి.పవిత్రాచారి ఎంపికైంది. జిల్లా నుంచి ఎంపికైన మొదటి క్రీడాకారిణి కాగా, ఆమెను శుక్రవారం డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి అభినందించారు. కాగా, ఉషూ టోర్నీ నవంబర్ 1 నుంచి 4వ తేదీ వరకు గోవాలో జరగనుంది. కార్యక్రమంలో ఉషూ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.పరిపూర్ణాచారి తదితరులు పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తుల సేకరణ పెంచాలి


మాట్లాడుతున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలంటౌన్: ఏజెన్సీలోని గిరిజనుల నుంచి అటవీ ఉత్పత్తుల సేకరణ పెంచాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన జీసీసీ అధికారులతో సమీక్షించారు. ఏజెన్సీలోని ఆటవీ ఉత్పత్తుల సేకరణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఇందుకోసం ఆదివాసీలకు అవగాహన కల్పిస్తూ ప్రోత్సహించాలని తెలిపారు. కాగా, ఈ సమావేశం అనంతరం జీసీసీ జీఎం సీతారాం.. అధికారులతో సమావేశమయ్యారు. గిరిజన సహకార సంస్థల ద్వారా ఆదివాసీ గిరిజనుల నుంచి ముష్టి గింజల సేకరణను పెంచాలని, వారికి గిట్టుబాటు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈసమావేశాల్లో సమావేశంలో ఏపీఓ డేవిడ్ రాజ్, అధికారులు ఉదయ్‌భాస్కర్, విజయ్‌కుమార్, సత్యనారాయణ, దీపాలాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


పురస్కారాలను అందిస్తున్న సొసైటీ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: పదో తరగతి, ఇంటర్‌లో 95 శాతం మార్కులు సాధించిన ఖమ్మం సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ షేర్ హోల్డర్స్ పిల్లలకు యాజమాన్యం శుక్రవారం నగదు పురస్కారాలు అందజేసింది. ఖమ్మంలోని బాలాజీనగర్‌లో జరిగిన సమావేశంలో సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ కే.వీ.సుబ్బయ్య చౌదరి మాట్లాడుతూ గత 26 ఏళ్లుగా ప్రతిభ కనబర్చిన బ్యాంకు షేర్ హోల్డర్ పిల్లలకు పురస్కారాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈసారి నలుగురికి రూ.10 వేలతో పాటు ప్రశంసాపత్రాలను అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ కె.సైదేశ్వరరావు, బ్రాంచ్ రిలేషన్‌షిప్ మేనేజర్ జి.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి దసరా ధమాకా..

- 14 రోజుల్లో రూ.1.40 కోట్ల ఆదాయం
- పండుగ వేళ రీజియన్‌లో 15.62 లక్షల మంది ప్రయాణం



ఖమ్మం బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ (ఫైల్)

ఖమ్మంమామిళ్లగూడెం/చుంచుపల్లి: బతుకమ్మ, దసరా పండుగలతో ఆర్టీసీకి దండిగా ఆదాయం సమకూరింది. అధికారులు ఖమ్మం రీజియన్‌లోని ఏడు డిపోల నుంచి 14 రోజులపాటు ప్రత్యేక సర్వీసులు నడిపించారు. ఈ నెల 13 నుంచి 26 వరకు ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు డిపోల నుంచి 695 సర్వీసులను హైదరాబాద్‌తోపాటు పలు ప్రాంతాలకు తిప్పారు. అధికారుల ఏర్పాట్లకు తగినట్లుగా ప్రయాణికులు అధికంగా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించడంతో ఆదాయం కలిసొచ్చింది. దీంతో గడిచిన 14 రోజుల్లో ఖమ్మం రీజియన్‌కు రూ.1.40 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో ఖమ్మం డిపోకు అత్యధికంగా రూ.41,19,771 రాగా, రెండో స్థానంలో భద్రాచలం డిపోకు రూ.38,85,459 ఆదాయం వచ్చింది. ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) కూడా పెరిగిందని అధికారులు తెలిపారు.

రీజియన్‌లోని డిపోల పరిధిలో వచ్చిన దసరా ఆదాయం (రూ.ల్లో)

డిపో	ఆదాయం	ఓఆర్ శాతం
ఖమ్మం	41,19,771	70
భద్రాచలం	38,85,459	74
సత్తుపల్లి	25,62,102	69
మణుగూరు	16,85,097	72
కొత్తగూడెం	9,96,509	70
మధిర	6,57,319	64
ఇల్లెందు	97,274	63

రద్దీని ఊహించుకుని..

పండుగల సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ అధికారులు ఆదాయం రాబట్టేందుకు ప్రత్యేక ప్రణాళికలను అమలు చేస్తున్నారు. ఇటీవల రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక సర్వీసులు నడిపించడంతోపాటు లక్కీ డ్రా ప్రవేశపెట్టగా భారీ ఆదాయం సమకూరింది. దీంతో దసరా రద్దీని ఊహించిన అధికారులు అదనపు చార్జీలు లేకుండానే ప్రత్యేక సర్వీసులు నడిపించారు. అలాగే, రాఖీ మాదిరిగా లక్కీ డ్రా ప్రవేశపెట్టారు. ఫలితంగా ప్రయాణికులు ఆర్టీసీ వైపు మొగ్గు చూపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి దసరాకు ప్రయాణికుల సంఖ్య పెరిగింది. దసరాకు ప్రత్యేక బస్సుల్లో ఏకంగా 15.62 లక్షల మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వెళ్లిరావడం విశేషం. తద్వారా ఆర్టీసీ ఆశించిన దాని కంటే అధిక ఆదాయం సమకూరడంతో ఉద్యోగుల్లో జోష్ నింపినట్లయింది.

సమష్టి సహకారంతో సాధ్యమైంది..



దసరా పండుగ సందర్భంగా ముందస్తుగా ప్రణాళికలు రూపొందించి ప్రత్యేక బస్సులను హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాలకు నడిపాం. రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో 695 సర్వీసులను తిప్పాం. ఫలితంగా ఊహించిన దాని కంటే అధికంగా ఆదాయం సమకూరింది. ఉద్యోగుల సమష్టి సహకారంతోనే ఇది సాధ్యమైంది.

– సీహెచ్.వెంకన్న, ఆర్ఎం

ఎస్సారెస్పీ కాల్వకు గండి..

- అమీనాపురంలో రాత్రి వేళ గండికొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు
- కేసముద్రం స్టేషన్‌లో జలమయమైన కాలనీలు


కాల్వ గండి నుంచి వృథాగా పోతున్న నీరు

కేసముద్రం: గుర్తు తెలియని వ్యక్తులు ఎస్సారెస్పీ కాల్వకు గండికొట్టడంతో సాగునీరు వృథాగా పోయిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని అమీనాపురం సమీపాన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎస్సారెస్పీ డీబీఎం-48 కాల్వ నుంచి వెళ్లే ఉపకాల్వ(14ఎల్)కు అమీనాపురం వద్ద పాయింట్ ఏర్పాటుచేశారు. అక్కడ గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గండికొట్టారు. దీంతో నిండుకుండలా ఉన్న అమీనాపురం గ్రామ చెరువులోకి నీరు చేరి, ఆపై మత్తడి పడింది. నీటి ప్రవాహంతో శుక్రవారం తెల్లవారుజామున కేసముద్రం స్టేషన్‌లోని అంబేడ్కర్‌సెంటర్, సంతోష్‌నగర్ కాలనీ జలమయమయ్యాయి. దీంతో కాలనీప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. గుర్తుతెలియని వ్యక్తులు కాల్వకు జేసీబీని ఉపయోగించి గండి కొట్టినట్లుగా స్థానికుల ద్వారా తెలిసింది. ఈ సమాచారం అందుకున్న ఎస్సారెస్పీ డీఈ కుమారస్వామి, ఏఈ రూప్‌కుమార్ చేరుకుని డీబీఎం-48కాల్వ వద్ద గేట్ మూయించారు. ఆతర్వాత గండి పడిన చోట మట్టితో మరమ్మతులు చేపట్టడమే కాక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు డీఈ తెలిపారు.


ఎస్సారెస్పీ జలాలతో జలమయమైన కేసముద్రం స్టేషన్‌లోని అంబేడ్కర్‌సెంటర్

బియ్యం ధరలకు రెక్కలు



- సన్న రకాలకు క్వింటా రూ.6 వేలకు పైగానే..
- ఇతర రకాల ధర రూ.4 వేల నుంచి రూ.5,200 పైమాటే
- తొమ్మిది నెలల్లో రూ.2,700 మేర పెరిగిన ధర
- సన్నరకాల సాగు తగ్గడం, రైతుల వద్ద నిల్వలు లేకే ఈ పరిస్థితి

ఖమ్మంవ్యవసాయం: ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు.. అన్న చందంగా పప్పులు, బియ్యం ధరలు నానాటికీ పెరుగుతున్నాయి. నెల క్రితం వరకు కూరగాయల ధరలతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. కొద్ది రోజులుగా పప్పుల ధరలు పెరిగాయి. ప్రధానంగా కంది పప్పు ధర రెట్టింపు స్థాయికి చేరింది. ఇంతలోనే బియ్యం ధరలకు కూడా రెక్కలొచ్చాయి. ప్రస్తుతం సన్నరకాల బియ్యం ధర క్వింటా రూ.6వేలకు పైగా పలుకుతుండగా, ఇతర రకాల ధరలు రూ.4,500 నుంచి రూ.5,200 వరకు ఉన్నాయి. సీజన్‌తో పోలిస్తే క్వింటాకు ఏకంగా రూ.2 వేల నుంచి రూ.2,700 వరకు పెరగడం గమనార్హం.

రిటైల్‌కు వచ్చే సరికి..

ప్రస్తుతం సన్న రకాలను హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో రూ.56 నుంచి రూ.62 వరకు విక్రయిస్తున్నారు. బీపీటీ 5204(సాంబ మసూరి) రకం బియ్యం పాతవైతే కిలో రూ.60 కాగా, కొత్తవి రూ.54 వరకు ధర ఉంది. హెచ్ఎంటీ రకం హోల్‌సేల్‌లో రూ.62 కాగా, జగిత్యాల సాంబ(జేజీఎల్) రూ.56కు విక్రయిస్తున్నారు. ఇక రిటైల్ మార్కెట్‌లో కిలో ఒక్కంటికి రూ.2 నుంచి రూ.3 వరకు పెంచి అమ్ముతున్నారు. అలాగే సాధారణ రకాలను వివిధ బ్రాండ్ల పేరుతో రూ.45 నుంచి రూ.52 వరకు అమ్ముతుండడం ప్రజలకు భారంగా మారింది.

సహజమే అయినా అనూహ్యంగా..

పంట సీజన్‌తో పోలిస్తే ప్రస్తుతం బియ్యం ధర గణనీయంగా పెరిగింది. సన్న రకాల్లో కొన్ని రెట్టింపు స్థాయికి చేరాయి. పంటలు చేతికందే జనవరిలో సన్న బియ్యం ధర రకాన్ని బట్టి క్వింటాకు రూ.3,400 నుంచి రూ.3,800 వరకు ఉంటుంది. బియ్యం పాత పడితే కొద్దిమేర ధర పెరగడం సహజం. అయినా సన్న రకాల ధర రూ.4,500 నుంచి రూ.5,000కు మించి పలకపోగా.. ఈ ఏడాది ఏకంగా రూ.5,600 నుంచి రూ.6,200 వరకు చేరింది.

ధాన్యం నిల్వల కొరత

సన్న రకాల ధాన్యం నిల్వల కొరత బియ్యం ధరలు పెరగడానికి ఓ కారణంగా విశ్లేషిస్తున్నారు. రైతుల వద్దే కాక మార్కెట్‌లోనూ నిల్వలు తరిగిపోయాయి. ఈ ఏడాది రైతులు ధాన్యాన్ని అంతగా నిల్వ చేయకపోగా, నిల్వ చేసిన వారు అమ్మేశారు. మిల్లర్ల వద్ద మాత్రం నిల్వలు ఉన్నాయి. ధరల పెరుగుతాయనే అంచనాతో కొందరు మిల్లర్లు పెద్ద ఎత్తున ధాన్యాన్ని నిల్వచేసినట్లు సమాచారం.

సాగు తగ్గడం మరో కారణం

కేంద్రప్రభుత్వం వరిలో గ్రేడ్-1, కామన్ వెరైటీలకు నిర్ణయించే ధరలో తేడా రూ.20 వరకే ఉంటోంది. దొడ్డు రకాలతో పోలిస్తే సన్న రకాల కాలపరిమితి 20నుంచి 25రోజులు ఎక్కువ. తెగుళ్ల బెడద కూడా అధికమే. అలాగే, దొడ్డు రకాలతో పోలిస్తే సన్న రకం దిగుబడి తక్కువ. ఇలా రకరకాల కారణాలతో రైతులు దొడ్డు రకాల సాగుకే ప్రాధాన్యమిస్తున్నారు. దీంతో సన్న రకాల సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది. అలాగే, ఈ ఏడాది సాగర్ ప్రాజెక్టులోకి తగినంత నీరు చేరక ఆయకట్టులో వరిసాగు తగ్గింది. ఖమ్మం జిల్లాలో సాధారణ వరిసాగు 2.80లక్షల ఎకరాలు కాగా 2.25లక్షల ఎకరాలకు మించలేదు. ఆలస్యంగా కురిసిన వర్షాలతో సాగు తగ్గడమే కాక రైతులు దొడ్డు రకాలే ఎక్కువగా సాగు చేశారు. ఈ ప్రభావం కూడా బియ్యం ధరలపై పడిందని తెలుస్తోంది.

సీజన్, అన్ సీజన్లలో బియ్యం హోల్‌సేల్ ధరలు(క్వింటాకు రూ.ల్లో)

బియ్యం రకం	సీజన్	అన్ సీజన్
సాంబమసూరి	3,600	6,000
హెచ్ఎంటీ	4,100	6,200
జగిత్యాల సాంబ	3,000	5,000
పాయి సాంబ	2,800	4,600

గత ఏడాదితో పోలిస్తే ధర పెరిగింది



గత ఏడాది 25 కిలోల సాంబ మసూరి సీజన్‌లో రూ.వెయ్యికి లభించగా, అన్ సీజన్‌లో రూ.1,200 దాటలేదు. ఈ ఏడాది సీజన్‌లో రూ. 1,100 వరకు ఉండగా ఇప్పుడు రూ.1550కు విక్రయిస్తున్నారు. ఐదారు నెలల్లోనే పావు క్వింటా బియ్యానికి రూ.550 వరకు ధర పెరిగింది.

– సోమారపు సుధీర్‌కుమార్, ప్రకాశ్‌నగర్, ఖమ్మం

కొరత కారణంగానే పైపైకి..



సాగు తగ్గిపోయి, సన్న రకాల ధాన్యం నిల్వలు తగ్గడంతో బియ్యం ధరలు పెరిగాయి. మునుపెన్నడూ లేనివిధంగా ప్రస్తుతం క్వింటాకు రూ.2,500 మేర ధర పెరిగింది. మిర్యాలగూడెం, హుజూర్‌నగర్, సూర్యాపేట ప్రాంతాల నుంచి జిల్లాకు బియ్యం సరఫరా అవుతున్నాయి.

– రాయపూడి వెంకటేశ్వరరావు, వ్యాపారి, ఖమ్మం

ప్రత్యేక శ్రద్ధతో మెరుగైన బోధన, ఉత్తమ ఫలితాలు

గిరిజన గురుకులాల ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్

భద్రాచలంఅర్బన్: గిరిజన గురుకులాల్లోని పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ జనరల్, గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని గిరిజన గురుకులాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో సమావేశమైన ఆర్‌సీఓ మాట్లాడుతూ దసరా సెలవులు ముగిసినందున విద్యార్థులంతా త్వరగా పాఠశాలకు వచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే, వార్షిక పరీక్షల కోసం ఇప్పట్నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ దేవదాసు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులను తీసుకొస్తున్న తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఆర్‌సీఓ డేవిడ్‌రాజు

భద్రాద్రిలో నేడు శబరి స్మృతి యాత్ర

పాక్షిక చంద్రగ్రహణంతో సాయంత్రం ఆలయం మూసివేత


శబరి విగ్రహం

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యాన శనివారం శబరి స్మృతి యాత్ర నిర్వహించారు. ఏటా ఆశ్వయుజ మాసంలో పౌర్ణమి రోజున రామయ్యకు అపర భక్తురాలైన శబరికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ యాత్రను 2013లో ప్రారంభించారు. అప్పటి నుంచి పలు గ్రామాల నుంచి గిరిజనులను భద్రాచలానికి ఆహ్వానించి వారి సంస్కృతి, సంప్రదాయాల నడుమ యాత్రను వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం గిరి ప్రదక్షిణ, పుష్పాంజలి ఇతర కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఇందుకోసం అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు.

నేటి సాయంత్రం ఆలయం మూసివేత

పాక్షిక చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం రామాలయాన్ని మూసివేయనున్నారు. సాయంత్రం స్వామి వారి సేవా కార్యక్రమాల అనంతరం ఆలయం తలుపులు మూసి తిరిగి ఆదివారం తెల్లవారుజామున సంప్రోక్షణ అనంతరం తెరవనున్నారు. అప్పటి వరకు భక్తులకు దర్శనాలు ఉండవని ఆలయ ఈఓ రమాదేవి తెలిపారు.

ఓటర్లకు అవగాహన కోసం..

- ప్రభుత్వ కళాశాల ప్రహరీపై వాల్‌పెయింటింగ్‌లు
- విద్యార్థులకు పోటీలు నిర్వహించిన అధికారులు


వాల్ పెయింటింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఆదర్శ్ సురభి



పెయింటింగ్ వేస్తున్న విద్యార్థిని

ఖమ్మంమయూరిసెంటర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓటర్లు అందరూ ఓటుహక్కు వినియోగించుకునేలా అధికార యంత్రాంగం విస్తృత ప్రచారం చేస్తోంది. ఇందులో భాగంగా ఓటర్లకు అవగాహన కల్పించేలా వాల్ పెయింటింగ్ వేయించేందుకు గాను విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కేఎంసీ కమిషనర్, ఖమ్మం రిటర్నింగ్ అధికారి ఆదర్శ్ సురభి ఆధ్వర్యాన ఖమ్మంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో శుక్రవారం పోటీలు ఏర్పాటుచేయగా, డీఆర్ఎస్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల, పీజీ కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆలోచింపచేసే రీతిలో చిత్రాలు గీశారు. ప్రలోభాలకు లోనుకావొద్దని, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఓటు వేయడాన్ని బాధ్యతగా భావించాలనే సూచనలతో బొమ్మలు గీయగా ఆర్ఓ ఆదర్శ్ సురభి అభినందించారు.

అస్ట్రోటర్ఫ్ వికెట్‌లో రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ఆకట్టుకునేలా కోహ్లీ బొమ్మ !


నెట్స్‌లో ఏర్పాటు చేసిన కోహ్లీ మైనపు బొమ్మ

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో అస్ట్రోటర్ఫ్ వికెట్‌లో ప్రాక్టీస్ కోసం శుక్రవారం సాయంత్రం నుంచి రిజిస్ట్రేషన్లు మొదలయ్యాయి. దాదాపు రూ.70 లక్షల వ్యయంతో నిర్మించిన అస్ట్రోటర్ఫ్ వికెట్‌లో మొత్తం నాలుగు పిచ్‌లు సిద్ధం చేశారు. అంతేకాక మరో రెండు వికెట్లను ముందు భాగంలో రూపొందించారు. ఇందులో ప్రాక్టీస్ కోసం క్రీడాకారులు, ఔత్సాహికులు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. ఇప్పటికే 30 మందికి పైగా నమోదు చేసుకున్నారని క్రికెట్ అసోసియేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఎండీ.మసూద్ పాషా తెలిపారు. కాగా, నెట్స్‌లోకి కేవలం క్రికెటర్లకు మాత్రమే అనుమతి ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఎండీ ఫారుఖ్, తురాబ్ అలీ తదితరులు పాల్గొన్నారు. కాగా, పిచ్ వద్ద స్టాండ్స్‌లో ఏర్పాటుచేసిన విరాట్‌కోహ్లీ మైనపు బొమ్మ ఆకట్టుకుంటోంది.



పేర్లు నమోదు చేసుకున్న క్రికెటర్లతో నిర్వాహకులు

చెదిరిపోతున్న జ్ఞాపకం!

- పాల్వంచలో 1964 నాటి థియేటర్ నేలమట్టం
- 'తెర'మరుగవుతున్న చరిత్ర


వేణుగోపాల్ థియేటర్‌ను కూల్చివేస్తున్న దృశ్యం

పాల్వంచ: పాల్వంచ చరిత్రలో మొట్టమొదటి సినిమా హాల్ అయిన వేణుగోపాల్ థియేటర్ నేలమట్టమవుతోంది. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ థియేటర్‌తో ఇక్కడి ప్రజలకు మరిచిపోలేని బంధం ఉంది. 1964 సంవత్సరంలో ఈ థియేటర్‌ను నిర్మించగా.. మూడు తరాల ప్రజలు సినిమాలు వీక్షించారు. నాడు రూ.10 పైసలతో టికెట్ ధర మొదలైందని వృద్ధులు చెబుతుంటారు. సినిమా పోస్టర్లను వెదురు తడెక్కపై అంటించి ఇద్దరు మనుషులు ఊరూరా తిరిగి ప్రచారం చేసేవారట. దీంతో సినిమా చూసేందుకు స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఎడ్ల బండ్లు, సైకిళ్లు, కాలినడకన వచ్చేవారని చెబుతారు. ఇక ఉదయం సినిమాకు రాత్రే వచ్చి పడుకునేవారని, ఆఖరి షో ముగిశాక రవాణా సౌకర్యం లేక ఇక్కడే పడుకున్న వారూ ఉన్నారని పలువురు చెబుతున్నారు. కాగా, వేణుగోపాల్ థియేటర్ యజమానురాలు రాధమ్మకు నటరాజ్ సెంటర్ వద్ద రాజేశ్వరి, మినీ రాజేశ్వరి థియేటర్లు, కొత్తగూడెంలో నాగేశ్వర టాకీస్ ఉండేవి. కాలక్రమేణా రాజరాజేశ్వరి, మినీ రాజేశ్వరి తీసేసి అపార్ట్‌మెంట్ నిర్మించారు. అలాగే, నాగేశ్వర టాకీస్ స్థానంలో షాపింగ్ మాళ్లు నిర్మించారు. మిగిలిన వేణుగోపాల్ థియేటర్‌ను రాధమ్మ కుమార్తె మీనా కుమారి నిర్వహిస్తుండగా, కరోనా సమయంలో మూతపడింది. ప్రస్తుతానికి ఈ థియేటర్‌ను నేలమట్టం చేస్తుండగా, భవిష్యత్‌లో షాపింగ్ కాంప్లెక్స్ లేదా, మల్టీప్లెక్స్ థియేటర్ నిర్మించాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఏదిఏమైనా ఎందరికో జ్ఞాపకంగా ఉన్న థియేటర్ నేలమట్టం అవుతుండడంతో ఆవేదనగా చూస్తూ ముందుకు సాగుతున్నారు.

30 నుంచి విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా ఈనెల 30 నుంచి నవంబర్ 5వ తేదీ వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(కోల్ మూవ్‌మెంట్), చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ జె.ఆల్విన్ తెలిపారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరిని క్రియాశీలపరిచేలా ఈ వారోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. అన్ని గనులు, విభాగాల వద్ద తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో వాల్‌పోస్టర్లు ప్రదర్శిస్తామని తెలిపారు. అలాగే, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించడమేకాక విద్యార్థినీ, విద్యార్థులకు అవినీతి రహిత సమాజ స్థాపనకు 'అవినీతిని తిరస్కరించండి-దేశం పట్ల నిబద్ధత కలిగి ఉండండి' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు.